కార్మికుడి కుటుంబానికి ఉద్యోగుల చేయూత

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 9 : హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గత కొన్నేళ్లుగా కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్న దాసు (51) ఇటీవల గుండెపోటుతో మరణించాడు. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు తోటి కాంట్రాక్ట్ కార్మికులు, సింగరేణి అధికారులు, ఉద్యోగులంతా కలిసి రూ. 90 వేలను సేకరించారు. ఈ మొత్తాన్ని బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్. డీఎం సుభానీ ఉద్యోగుల సమక్షంలో దాసు కుటుంబసభ్యులకు అందజేశారు. ఉద్యోగులు అందించిన సహకారంపై దాసు కుటుంబీకులు హర్షం వ్యక్తం చేస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'కాచిగూడ శ్మశానవాటికను అభివృద్ధి పరచండి'

కాచిగూడ, ఏప్రిల్ 9: కాచిగూడ, హర్రస్‌పెంటలోని శ్మశానవాటిక అభివృద్ధిని జీహెచ్‌ఎంసీ అధికారులు విస్మరిస్తున్నారని హిందూ శ్మశానవాటిక ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలోని 292 శ్మశానవాటికల్లో అతిపెద్దదైన అంబర్‌పేట శ్మశానవాటికలో అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి జరగడంలేదని ఆరోపించారు. శ్మశానవాటికను ఆనుకొని ఉన్న మూసి నాలా చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వస్తున్నదని,దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. శ్మశానవాటిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో నిర్మించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఆయన వెంట రాజ్‌కుమార్‌విగ్, సాయిగిరిధర్, కృష్ణగౌడ్, నందకిశోర్ యాదవ్, విజయ్‌కుమార్, రతన్, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలండి

- కార్యకర్తల సమావేశంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఏప్రిల్ 9: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రావాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం శివం రోడ్డులోని ఓ హోటల్‌లో నల్లకుంట డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు అంబర్‌పేట నియోజకవర్గం నుంచి బస్తీలు, కాలనీల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. ఆవిర్భావం సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలన్నారు. ప్రతి ఒక్కరూ గులాబీ షర్ట్ ధరించి సమయానికి అందరూ రావాలన్నారు. ఉదయం 8:30 గంటలకు ఫీవర్ హాస్పిటల్ చౌరస్తాలో జెండా ఎగరవేసిన అనంతరం బస్తీల్లో జెండా ఎగరవేయాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టడానికి ఈ సభ వేదిక అవుతుందన్నారు. హెచ్‌సీయూ సంఘటనలో కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ డివిజన్ సీనియర్ నాయకులు వి. రవీంద్రరావు, భూపతినాథ్, కిషన్‌రావు, విజయేంద్రసాగర్, భాస్కర్‌గౌడ్, గోనె ప్రదీప్‌రావు, కూర నరేందర్, గెల్వయ్య, ఓంప్రకాశ్‌యాదవ్, నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, చంద్రమోహన్, భీష్మదేవ్, సాయినిమూర్తి, రమణనాయుడు, శోభ ముదిరాజ్, ఇర్ఫాన్ సుల్తానా, లావణ్య, రమ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాదయాత్రలు దోహదం : ఎమ్మెల్యే

గోల్నాక : నియోజకవర్గ వ్యాప్తంగా చేపడుతున్న పాదయాత్రలు స్థానిక సమస్యల పరిష్కారానికి దోహద పడుతున్నాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ హైమద్‌నగర్‌లో స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పాదయాత్ర నిర్వహించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కొత్తగా వీధి దీపాల ఏర్పాటు, మంచి నీటి సరఫరాలో సమస్యలతోపాటు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ ప్రదీప్, విద్యుత్ ఏఈ సౌమ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు దుర్గ, రమేశ్, సిబ్బంది రాజేశ్, సతీశ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హైమద్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెంకటేశ్, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

పేద పూజారులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో ధూప దీప నైవేద్యం సమర్పిస్తున్న పలువురు పేద పూజారులకు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రతి నెలా గౌరవ వేతనం అందజేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం గోల్నాక క్యాంపుకార్యాలయంలో 10 మంది పూజారులకు ఒకొక్కరికీ రూ. 5వేల చొప్పున మొత్తం రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను పూజారులు ఆశీర్వదించారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

మెహిదీపట్నం, ఏప్రిల్ 9: తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని కార్వాన్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కే. శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మెహదీపట్నంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌ను శేఖర్‌రెడ్డి ఘనంగా సన్మానించి మాట్లాడారు. కార్యకర్తలంతా భారీగా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

భారీగా తరలండి..

కాచిగూడ : తెలంగాణ అంటే దేశ ప్రజలకు గుర్తుకొచ్చేది కేసీఆర్ పేరేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బద్దుల శ్రీకాంత్ యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌లో ఈనెల 27న ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు డివిజన్, బస్తీ, వార్డు స్థాయి కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 14 నెలల పరిపాలనలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నదని ఆయన విమర్శించారు.

'వాసవి'లో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

మెహదీపట్నం ఏప్రిల్ 9 : యువత మత్తుకు బానిస కావద్దని, డ్రగ్స్‌ను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రిటైర్డ్ ఐపీఎస్ సందీప్ శాండిల్య అన్నారు. బుధవారం గోల్కొండ ఇబ్రహీంబాద్ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో టీజీ యాంటీ నార్కొటిక్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సందీప్ శాండిల్య మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ డ్రగ్స్ అమ్మకాలు జరిగినా వెంటనే విద్యార్థులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కావద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని గాడిలో పెట్టేది ఏఈఓలే..

- వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎ.కోదండరెడ్డి తదితరులు

రవీంద్రభారతి,ఏప్రిల్ 9 : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు, నూతన వరవడిన తీసుకువచ్చేది వ్యవసాయ విస్తరణాధికారులేనని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్యవేదిక(టి-వావ్) తొలి డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకువచ్చేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు కృషి చేయాలన్నారు. నిత్యం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైనట్లే, నూతన మార్పులను తీసుకువరావాలని సూచించారు. వైద్యులు విధంగా రోగికి ఎలా చికిత్స చేస్తారో.. వ్యవసాయ విస్తరణాధికారులు పంటలకు సోకిన తెగుళ్లకు చికిత్స చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయాన్ని గాడిన పెట్టేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. టీ-వావ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ బాదావత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీ-వావ్ సెక్రటరీ కళ్యాణి, పలువురు వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది చంద్రరాజేశ్వరరావు

హిమాయత్ నగర్,ఏప్రిల్ 9: పేదలకు సాగు భూములు, ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటాలుచేసి ఎన్నో విజయాలు సాధించిన గొప్ప మానవతావాది దివంగత కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం హిమాయత్ నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాభ్యాస్యంలోనే రాజేశ్వర రావు వామ పక్ష భావజాలానికి ఆకర్షితులై సమాజానికి సేవలు అందించారని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలం పాటు ప్రజా ఉద్యమాలను నడిపి తన ఆస్తులను సైతం పేదలకు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు ఆర్.అంజయ్య నాయక్, మారుపాక అనిల్ కుమార్,చందు నాయక్, శంకర్ నాయక్, శ్రీమాన్, రఘు, గోవింద్, శ్రీరాములు, దశరథ్, అంజ య్య, నరసింహ, రాజేందర్, సురేందర్, శివ,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన పురాతన గోడ..

కారుపై కూలిన గోడ

చార్మినార్, ఏప్రిల్ 9: పాత నగర అభివృద్ధి సంస్థ ఖులీ ఖుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (qqsuda) కార్యాలయ ప్రహరీ బుధవారం ఒక్కసారిగా కుప్పకూలింది. కొంతకాలంగా గోడకు పగుళ్లు వస్తున్నా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు సుమారు 15మీటర్లకు పైగా కార్యాలయ బాహ్య ప్రహరీ పెచ్చులుడుతూ ప్రమాదభరితంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి గోడ మరింత దెబ్బతిని బుధవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలినట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో గోడ సమీపంలో పార్క్ చేసిన కారు పాక్షికంగా ధ్వంసమైనట్లు యజమాని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

టోలిచౌకి డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్

మెహదీపట్నం ఏప్రిల్ 9 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిన పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. బుధవారం టోలిచౌకి డివిజన్‌లోని హకీంపేట్, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లోఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జలమండలి అధికారులకు ఫోన్లు చేసి తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని ఆదేశించారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు : కార్పొరేటర్

న్యూపటేల్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్నాక, ఏప్రిల్ 9: స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం డివిజన్‌లోని న్యూ పటేల్‌నగర్‌లో ఆయన పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కచ్చా మోరి నాలా ప్రహరీ కూలిపోయిందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. నాలాలో చెత్త, వ్యర్థాలు తొలగించి ప్రహరీ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, బీఆర్ఎప్ నాయకులు మహేశ్ ముదిరాజ్, ధరం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లంగర్‌హౌస్‌లో అధికారుల పర్యటన

మెహదీపట్నం ఏప్రిల్ 9 : శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం లంగర్‌హౌస్‌లోని నాయీ బ్రాహ్మణ సంఘం శ్మశానవాటికలో పర్యటించారు. ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమసిద్ధికి, ఏఈ ఫరీద్‌తో కలిసి శ్మశానవాటికలో సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు మాతంగి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్నాం..'

కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న వైశ్య హాస్టల్, ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు

కాచిగూడ, ఏప్రిల్ 9: పేద విద్యార్థుల ఉన్నత చదువుకు చేయూతనందిస్తున్నట్లు వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొత్తూరు జయప్రకాశ్‌రామ్ అన్నారు. బుధవారం వైశ్య హాస్టల్ ఆవరణలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు చేయూత అందిస్తూ, అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్, కార్యదర్శి పబ్బతి రవిప్రసన్నకుమార్, కోశాధికారి పి. రాజేశ్వర్‌రావు, మేడం దయాకర్, కూర సతీశ్, జయరాములు గుప్తా, సాంబయ్య, రామచందర్, మేనేజర్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కార్వాన్, ఏప్రిల్9 : గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ భైరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర లాతుర్ జిల్లాకు చెందిన సంతోష్ భోస్లే(40) పదేండ్ల క్రితం కార్వాన్ ప్రాంతానికి వచ్చి భార్య సావిత్రి భోస్లే, ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. కూలీగా పనిచేస్తున్న సంతోష్ భోస్లే తాగుడుకు బానిసయ్యాడు. గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ ఘాట్ హిందూ శ్మశానవాటిక సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానాకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు..

కాచిగూడ, ఏప్రిల్ 9: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు డోన్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడ బౌద్ధనగర్ ప్రాంతానికి చెందిన రాళ్లబండి బాబురావు(64) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనేక దవాఖానల చుట్టూ తిరిగినా జబ్బు నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాబురావు బుధవారం ఆర్ట్స్ కళాశాల రైల్వే స్టేషన్ సమీపంలో డోన్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సైదాబాద్,ఏప్రిల్ 9: గడ్డి అన్నారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం సైదాబాద్ డివిజన్ కళ్యాణ్ నగర్ లోని మెడిప్లేస్ హాల్ పై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగమల్ల అనిల్ కుమార్ ఒక ప్రకటన తెలిపారు. బీపీ,షుగర్, నేత్ర, దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేస్తారని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన తప్పదు..

- బీఆర్ఎస్ నాయకుడు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్ ఏప్రిల్ 9: గోషామహల్ నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఎం. ఆనంద్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తాగునీటి సమస్యలపై ఖాళీ బిందెలతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో ఆనంద్‌కుమార్‌గౌడ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఏడాదిన్నర క్రితం ఆంధ్రాబ్యాంక్ వద్ద మంజూరైన పైప్‌లైన్ పనులు పూర్తయితే గౌలిగూడ, సుధా మెడికల్‌హాల్, ఇడ్లీ గల్లి, పూసల బస్తీ తదితర ప్రాంతాల్లో తాగునీటితో పాటు కలుషిత నీటి సరఫరా సమస్యలు తొలగిపోతాయన్నారు. ఈ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాంబాగ్, గౌలిగూడ, డాక్టర్ గల్లి, కట్టెలమండి ప్రాంతాల్లో బోర్‌వెల్ పని చేయడం లేదని అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం మరమ్మతులు కూడా చేయించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టగా, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్రంలో విపరీతమైన తాగునీటి ఎద్దడి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి గోషామహల్‌లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'స్త్రీనిధి'లో అక్రమాలపై విచారణను ముమ్మరం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 9: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ స్త్రీ నిధి సంస్థలో జరిగిన అక్రమాలు, అవినీతిపై జరుగుతున్న విచారణను ముమ్మరం చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్(టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. స్త్రీనిధి సంస్థలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారిని లక్ష్యంగా చేసుకొని టార్చర్, ట్రాన్స్ఫర్, టర్మినేషన్, కెరీర్ అడ్వాన్స్మెంట్లలో వివక్షతతో అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఉద్యోగులకు సరైన సౌకర్యాలు లేవని, టాక్సిక్ వర్క్ కల్చర్ ఉండటంతో 350పైచిలుకు ఉద్యోగులు రాజీనామాలు చేశారని గుర్తు చేశారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి సిబ్బందికి న్యాయం చేయాలని కోరామని చెప్పారు.

స్త్రీనిధిలో జరిగిన అవకతవకలు, అవినీతిపై విచారణ జరపాలని ఆమె గతేడాది సెప్టెంబర్ 13న ఆదేశించారని పేర్కొన్నారు. ఈ విచారణను పక్కన పెట్టి ఎండీగా విద్యాసాగర్‌రెడ్డికి మళ్లీ రెన్యువల్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అక్రమంగా తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకుండా గత రెండేండ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ నిబంధనల ప్రకారం రూ.350 కోట్ల టర్నోవర్ ఉన్న ప్రభుత్వరంగ సంస్థలకు కచ్చితంగా ఐఏఎస్ అధికారే మేనేజింగ్ డైరెక్టర్/వైస్ చైర్మన్‌గా ఉండాలన్నారు. ముందుగా ఆయన చేసిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సొసైటీలుగా ఉన్న గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లను విలీనం చేస్తూ ఆదేశాలు జారీచేసినందున, స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్యను కూడా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర సహకార బ్యాంకులో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు అక్రమంగా తొలగించిన 350 మందికి పైగా ఉద్యోగులను తిరిగి వీధుల్లోకి తీసుకోవాలన్నారు. స్త్రీనిధి సంస్థను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దీనికోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, కుల సంఘాలు, యువజన సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మంత్రివర్గంలో లంబాడాలకు స్థానం కల్పించాలి

- సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ డిమాండ్

కవాడిగూడ, ఏప్రిల్ 9 : రాష్ట్ర వ్యాప్తంగా లంబాడాలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని సేవాలాల్ బంజార సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్‌నాయక్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే నిర్ణయం తీసుకోకపోతే గురువారం ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

లంబాడీ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ లంబాడీ లడాయి పేరుతో సేవాలాల్ బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద నిరాహారదీక్ష, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. అగ్రకులాలకు మాత్రమే రాజకీయ అవకాశాలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీ సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్, గిరిజన సంఘం రా